కథ

# పాతకాలం వాడు

## ఎం.మాధవీ కృష్ణ

"ఊ..గుడ్" చెయిర్‌లో రిలాక్స్‌గా వెనక్కి వాలుతూ అన్నాడు ఎం.డి. పరాంకుశం. మూడేళ్లుగా ఆయన దగ్గర ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు అన్వేష్. తను కొత్తగా క్రియేట్ చేసిన డిజైన్స్, వాటికి సంబంధించిన డ్రాయింగ్స్ ఎం.డి. ముందు సబ్మిట్ చేసి అతను సంతృప్తిగా తల ఊపాక జేబులోంచి లీవ్ లెటర్ తీశాడు.

"ఏమిటి.. మళ్లీ పెళ్లిచూపులా?" లెటర్ అందుకుంటూ అన్నాడు ఆయన.

కొద్దిగా సిగ్గు. అవుననటానికి మొహమాటం.. అన్వేష్ మోములో దోబూచులాడాయి.

"నువ్వు మరీ పాతకాలంవాడివయ్యా.. ఈ రోజుల్లో కుర్రాళ్లందరూ ఫాస్ట్‌గా ఉండి అమ్మాయిల్ని సొంతంగా సెలెక్ట్ చేస్కుంటుంటే నువ్వేంటి ఇలా? మన ఆఫీసులో చాలామంది అమ్మాయిలు నిన్ను కలవరిస్తున్నారంట. వార్త నా దాకా వచ్చిందిలే" నవ్వుతూ అన్నాడు ఆయన.

"పెళ్లంటే రెండు కుటుంబాలకు సంబంధించింది కద సార్"

"వెరీగుడ్.. ఇంతకీ ఏ ఊరు వెళ్తున్నావ్?"

"తిరుపతి దగ్గర.."

"శుభం.. ఆ ఏడుకొండలవాడే నీ లైఫ్ సెటిల్ చేస్తాడులే..వెళ్లిరా..ఆల్ ది బెస్ట్"

"థాంక్యూ సార్" చెబుతూ బయటికొచ్చాడు. పూనాలో ఉన్న మెయిన్ బ్రాంచి అది. దానికి సంబంధించి ముంబాయిలో ఉన్న సబ్ బ్రాంచిలో పనిచేస్తున్నాడు అన్వేష్. వర్క్ సబ్మిట్ చేయటానికి అప్పుడప్పుడూ పూనా రావటం అన్వేష్‌కి అలవాటైంది. సాటి తెలుగువాడవ్వటం వలన అన్వేష్ మీద పరాంకుశానికి అభిమానం హెచ్చు.

ఆఫీసు నుంచి బయటికొస్తుంటే అతని కోసమే ఎదురుచూస్తున్న వ్యక్తి దగ్గరికొచ్చాడు.

"సార్..మరోసారి ఆలోచించండి" అడిగాడు ఆ వ్యక్తి. క్రియేటివ్ రంగంలో అన్వేష్ సృష్టిస్తున్న డిజైన్స్‌కు మార్కెట్‌లో పరాంకుశం కంపెనీకి మంచి డిమాండ్ వచ్చింది. దాంతో బయటి సంస్థల నుంచి అన్వేష్‌కి ఆఫర్స్ వస్తున్నాయి. అతని టాలెంట్ గుర్తించి ప్రోత్సహించిన పరాంకుశం జీతం కూడా రెండింతలు చేశాడు. "సారీ.. ప్రస్తుతానికి నాకిక్కడ బాగానే ఉంది" ఆ వ్యక్తికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా బయటికి నడిచాడు. "మంచి శాలరీ ఆఫర్ చేస్తున్నా.. వద్దంటాడే.. హు! పాతకాలం వాడు" నిట్టూర్చాడు అవతలి వ్యక్తి.

రామారావు దంపతులకు అన్వేష్, విశాల ఇద్దరు పిల్లలు. ఆరేళ్ల క్రితం విశాల పెళ్లి చేసి కన్యాదాతలయ్యారు వాళ్లు. ఏణ్ణర్ధంగా అడపాదడపా అన్వేష్‌కి సంబంధాలు చూస్తున్నారు. అతనికి అమ్మాయిలు ఒక పట్టాన నచ్చటం లేదు.

బాగా చదువు ఉన్న అమ్మాయి కావాలంటాడు. పాష్‌నెస్ కనిపించకూడదంటాడు. అందచందాలు ఆధునికత మనసులో ఉండాలి కానీ రూపంలో కాదంటాడు. తెలివితేటలు, సహనం ఇలాంటివే అవసరం అంటాడు సంకుచితత్వం వలదంటాడు. అతని కోరికల లిస్టు విన్న మ్యారేజి బ్రోకర్స్ ఓ నమస్కారం పెట్టారు. "బాబూ! నువ్వు చూసే ఐదు నిమిషాల పెళ్లిచూపుల్లో అన్ని లక్షణాలు ఎలా కనిపిస్తాయం"టూ వాదించారు.

"మీకు చేతనైతే తీసుకురండి" చిరునవ్వుతో సమాధానం చెప్పేవాడు.

"అమ్మా! మీ అబ్బాయి బయటకు జీన్స్ ప్యాంట్ వేసుకునే వాడే కానీ, లోలోపల మరీ పాతకాలం వాడు" అతని మీద ఓ గట్టి అభిప్రాయానికి వచ్చి తల్లికి చెప్పారు.

"వీడికి పెళ్లవుతుందా?" తల్లి బెంగపడింది.

"నువ్వు భయపడకమ్మా.. తమ్ముడికి కావల్సిన అమ్మాయిని నేను వెతికిపెడతాగా" కూతురు ఫోన్‌లోనే భరోసా ఇచ్చింది.

అన్నట్లుగానే నెల తిరిగేసరికి వాళ్ల ఊళ్లోనే ఉన్న ఓ చక్కటి సంబంధం గురించి చెప్పింది. ఆ సంబంధం కోసమే ఇప్పుడు అన్వేష్ ప్రయాణం.

"ఏరా తమ్ముడూ.. బయల్దేరుతున్నావా.. గ్యారంటీనా.." ప్లాట్‌ఫామ్ మీద ఉన్నప్పుడు విశాల ఫోన్ చేసింది.

"ఆ స్టేషన్‌లోనే ఉన్నాను. రేపు తెల్లవారుజామునకి రీచ్ అవుతాను అన్నట్లు నాన్నగారు వాళ్లు చేరారా?" అడిగాడు. తల్లీ, తండ్రి నెల్లూరులో ఉంటున్నారు.

"వచ్చే టైమైంది. మీ బావ వాళ్లని రిసీవ్ చేస్కోటానికి స్టేషన్‌కి వెళ్లారు"

"అక్కా! ఉదయం తొమ్మిదింటికే వాళ్లింటికి వెళదాం అన్నావ్. మరీ అంత పొద్దున్నే అంటే వాళ్లు ఇబ్బంది పడతారేమో.. అసలు వాళ్లకి చెప్పావా.. అని.."

అక్క సంగతి తెలుసు అతనికి. తను, తన కుటుంబం గురించి తప్ప, ఇతరుల ఇబ్బందులు, ఇక్కట్లు ఆమెకి పట్టవు.

"నువ్వు మరీ పాతకాలం వాడివిరా. ఈ రోజుల్లో అతవలి వాళ్ల గురించి పట్టించుకునే వాళ్లెవరు? వాళ్ల తిప్పలు వాళ్లు పడతార్లే" నిర్లక్ష్యంగా అంది.

"నువ్వసలు వాళ్లకి మన టైమింగ్స్ చెప్పావా?" విసుగ్గా అన్నాడు.

"ఆ! ఆ! చెప్పాన్లే. నువ్వు ప్రశాంతంగా ఉండు" ఫోన్ పెట్టేసింది.

ట్రైన్ సోలాపూర్, రాయచూర్ దాటి ముందుకు సాగింది. ట్రైన్‌లో అమ్మే పదార్థాలు వడాపావ్, సమోసా మిర్చి మారిపోయి ఇడ్లీ, దోశల వాసన రాసాగింది. "కడప రైల్వేస్టేషన్" బోర్డ్ చూస్తూ కిందకి దిగాడు అన్వేష్. రాత్రి సమయం.. వర్షాలు సన్నగా కురుస్తుండటంతో వాతావరణం మబ్బులు పట్టి ప్లాట్‌ఫామ్ మీది ట్యూబ్‌లైట్స్ చీకటి చిక్కదనాన్ని ఆపలేకపోతున్నాయి. స్టాల్‌లో రెండు అరటిపళ్లు, పూరీ కూర ప్యాకెట్, వాటర్ బాటిల్ కొని క్యారీబాగ్‌లో వేశాడు. పక్కనే సినీతారల మ్యాగజైన్స్ వేలాడదీసి ఉన్నాయి. పత్రిక ముఖచిత్రం మీద అందంగా కనిపిస్తున్నాడు అతని అభిమాన హీరో. "ఈ బుక్ ఎంత?" అడుగుతూ పర్స్‌లోంచి డబ్బులు తీసిచ్చాడు.

ట్రైన్ కదలటానికి ఇంకా టైముండడంతో ప్లాట్‌ఫామ్ మీద లైటింగ్ పడే బెంచి మీద కూర్చుని పత్రిక తిరగెయ్యసాగాడు.

"అన్నా..అన్నా" చేతులు చాపి ఎదురుగా ఉన్నాడు తొమ్మిదేళ్ల పిల్లాడు.

చొక్కా, నిక్కరు ఆకారంలో పైనొకటి, కిందొకటి





చీలిపోయిన గుడ్డలు కట్టుకుని ఉన్నాడు వాడు. దుమ్ము కొట్టుకుని పోయి, ఎన్నాళ్లుగానో స్నానం అనేది ఎరగని వాడిలా ఉన్నాడు వాడు. డొక్కలు లోపలకి పోయి కాళ్లు చేతులు సన్నగా.. బలహీనంగా కనిపిస్తు న్నాడు. "ఏయ్ పో.." పేజీలు తిరగేసే మూడ్‌లో అన్నాడు.

"అన్నా..అన్నా.." వాడు మళ్లీ బతిమాలాడు.

జేబులోంచి రెండ్రూపాయల బిళ్ల తీసిచ్చాడు. "అన్నా.. అన్నం తిని మూడ్రోజులైంది." పక్కనున్న పూరీ ప్యాకెట్ వైపు చూస్తూ అన్నాడు. అడుక్కు తినటా నికి ఎంత అభిమాన పడుతున్నాడో వాడి మొహం చూస్తే అర్థమైపోతోంది. అన్వేష్‌కి జాలి కలిగింది.

"తీస్కో" ప్యాకెట్ వాడికిచ్చాడు. అక్కడే కూర్చుని గబగబా పూరీ నోట్లో కుక్కుకున్నాడు. ఆత్రంగా తిన టంతో మధ్యలో కొరపోయింది.

ప్రాణం పోయినా ఫరవాలేదు. ఆకలి తీరాలన్న ట్లుగా మధ్యలో గ్యాప్ ఇవ్వలేదు వాడు. రెండ్నిమిషాల్లో అరటిపళ్లు కూడా ఖాళీ చేశాడు. పేజీలు తిరగేస్తూ మధ్యలో వాడి వైపు చూస్తున్నాడు అన్వేష్. తినటం పూర్తి చేసి రివ్వున పరిగెత్తుకెళ్లి కొళాయి దగ్గర నీళ్లు తాగి మళ్లీ బెంచి దగ్గరకు వచ్చాడు. వాడి మొహంలో కాస్తంత రిలీఫ్.

"అన్నా.. ఈ బెంచి ఒక్కటే ఖాళీగా ఉంది" కూర్చో వచ్చా అన్నట్లు అడిగాడు.

అన్వేష్ బెంచి చివరకు జరిగాడు. తగలకుండా బెంచికి అటు చివర కూర్చున్నాడు వాడు.

"నాల్రోజుల్నుంచీ జ్వరమన్నా.. బోగీలు శుభ్రం చెయ్యనీకి, లగేజి మొయ్యనీకి కాలే. అందుకే.. అడుక్కో వాల్సొచ్చింది" వాడి బాధ మాటల్లో వ్యక్తపరిచాడు. ఆ వయసులోనే వాడిలో ఉన్న స్వాభిమానానికి ముచ్చటే సింది.

"అవునూ.. నీకు అమ్మా, నాన్నా లేరా?" కొద్దిగా ఇంట్రెస్టింగ్‌గా అనిపించటంతో అడిగాడు.

వాడి కళ్లల్లో చివ్వున నీళ్లు చిప్పిల్లాయి. ఏడాదిగా ఆ రైల్వేస్టేషన్‌లో వాడ్ని ఆమాత్రం పలకరించిన వాళ్లు లేరు.

"సిమెంటు పనికి బోతారన్నా.. రెండేళ్ల క్రితం కట్టడం కూలి ఆద్నే సచ్చిపోయిండ్రు" ఏడుపు దిగమిం గుకుంటున్నాడు వాడు. "మీ వాళ్లెవరూ లేరా?" మళ్లీ అడిగాడు అన్వేష్.

"లేకేం.. మా అత్త నన్ను తీస్కుబోయింది అమ్మా, నాయిన ఉన్నప్పుడు ఇస్కూలుకు బొయ్యేవాడ్ని. అమ్మెప్పుడూ నువ్వు బాగా సదూకోవాలిరా అంటుండేది. అత్త నన్ను సావుకారింట్లో పనికి బెట్టింది. వాళ్లింట్లో పెద్ద పని లేదన్నా.. వాళ్ల బుడ్డోడిని ఆడిచ్చటమే నా డూటీ. ఓ రోజు ఉన్నట్టుండి పడిపో యినా. కావాల్సి దొంగేషాలు ఏత్తన్నా నని అత్త నన్ను బాగా కొట్టింది. మళ్లీ రెండు, మూడు మార్లు కళ్లు తిరిగి పడి పోయినా.. దవాఖానాలో చూయిస్తే.. అదేందో గుండెజబ్బంట. వైద్యం జెయ్యకుంటే ఏడాదికన్నా ఎక్కువ బతకడు అన్నరు డాక్టర్లు. దబ్బు ఏడ్నించి తేవాల.. అంటూ మా అత్త బయటకి గెంటేసింది. అప్పట్నించి ఇదే నా ఇల్లు.. "స్టేషన్ చూపిస్తూ అన్నాడు. గుండెల్లో అదుముకున్న దుఃఖం బయ టకి ఉరుకుతా అన్నట్లు కనిపిస్తుంది.

అమ్మా, నాన్న ఒడిలో పువ్వులా పెరగాల్సిన బాల్యం.. ఇలా ప్లాట్‌ఫామ్‌మీద.. అన్వేష్ మనసు కలచినట్లైంది.

"ఏదాది దాటిందన్నా" ఇంకా బతికే ఉన్నానన్నట్లు ఒక శుష్కహాసం వాడి పెదాల మీద మెరిసి మాయమైంది. "తీస్కో.." జేబులోంచి నాలుగు వందల నోట్లు తీసి వాడి చేతిలో పెట్టబోయాడు.

"వద్దన్నా.. మామూళ్లంటూ పెద్దోళ్లు గుంజుకుంటారు. ప్యాసింజర్లు చూస్తే మా డబ్బులు కాజేసినావురా.. అంటూ కొడతారు" చెయ్యి తోసేస్తూ అన్నాడు.

"ఉంచరా.." బలవంతం చేస్తూంటే వంద నోటు తీస్కున్నాడు. అది దాచటానికి వాడి శరీరం మీద సరైన బట్ట లేదు. అలాగే గుప్పిట్లో పెట్టుకుని అన్వేష్‌కి తగలకుండా కాళ్లు ముడుచుకుని అదే బెంచిమీద పడుకున్నాడు. జ్వర తీవ్రత వాడ్ని ఒణికిస్తోంది. ఆ కలతనిద్రలోనే చాన్నాళ్లుగా తన బాధ చెప్పుకోవటానికి ఓ తోడు లేక బడబాగ్నిలా దాచుకున్న దుఃఖం కళ్లల్లోంచి దూకి వస్తూ చెంపల్ని తడుపుతుంది.

"నువ్వు మంచివోడివన్నా.. జ్వరం.. నాల్రోజుల్నుంచి ఆకలి... నాకు గుండెజబ్బు" ఏదేదో నిద్దట్లో కలవరిస్తున్నాడు. కుమిలి, కుమిలి ఏడుస్తున్నట్లు వాడి వీపు కదులుతోంది.

వాడి పరిస్థితి చూస్తూంటే గుండె బరువెక్కినట్లయింది అన్వేష్‌కి. ట్రైన్‌కి సిగ్నల్ ఉండటంతో లోపలికొచ్చి కూర్చున్నాడు. అపురూపమైన బాల్యం ఎన్ని ఇక్కట్లు? వాడు ఇక ముందు బ్రతకడు అనే మాట గుర్తొస్తుంటే గుండెల్లో పొడిచినట్లుగా ఉంది అతనికి. ఆలోచనలో పడి ట్రైన్ కదలటం గమనించలేదు. అసలు వాడికున్న హార్ట్ ప్రోబ్లం ఏమిటో.. అదే మనసుతో ఉన్న అన్వేష్ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

'ఎంత పని చేశాడు తను? కనీసం వాడ్ని ఓ ఆర్ఫన్ హోమ్‌లో చేర్చినా బాగుండేది కదా. వాడు బతికున్నన్నాళ్లూ వాడికో ముద్ద పెట్టినా బాగుండేది. ఈమధ్య అదే పనిగా ఈ రకం పిల్లల్ని స్వచ్ఛంద సంస్థల వాళ్ల హోమ్స్‌లో చేరుస్తున్నారు. అయినా అక్కడక్కడా ఈ పని వాళ్లు మిగుల్తూనే ఉన్నారు. ట్రైన్ నిదానంగా వేగం పుంజుకుంటోంది. నిర్ణయానికొచ్చిన అన్వేష్ చైన్‌లాగి ట్రైన్లోంచి కిందికి దిగాడు. అక్కడ్నుంచి నడిచి మళ్లీ అదే బెంచి దగ్గరకు వచ్చేటప్పటికి పావుగంటపైనే పట్టింది. ఆత్రంగా వెళ్లిచూశాడు. అక్కడ వాడు లేడు. చుట్టూ చీకటి, వర్షం ముసురుకొని ఉంది. స్టేషన్ అంతా అణువణువూ వెతికాడు. దూరంగా ఓ కానిస్టేబుల్ ఆకారం.

కొంతమంది కుర్రాళ్లని తరుముతున్నాడు అతను. "పోండ్రా.. పోండి.. నాయాళ్లారా.." అతను దూరం నుంచి అరవటం వినిపిస్తూ ఉంది. ఆ కానిస్టేబుల్ దగ్గరికి వెళ్లి కుర్రాడి కోసం వాకబు చేశాడు. "భలే వాడివి సారూ.. పోరగాని కోసం మళ్లీ వస్తవా" అతను నవ్విన సౌండ్ కిళ్లీ నమిలిన గారపళ్లలోంచి వికృతంగా వచ్చింది.

రోజూ ఇలాంటి పిల్లల్ని ఎంతోమందిని చూసే అతనికి తన చర్యలు నవ్వు తెప్పించవచ్చు. 'రేపు దొరక్కపోతాడా.. వాడు ఇక్కడే ఉంటానన్నాడు కదా' ఆలోచిస్తూ వెళ్లి అదే బెంచి మీద కూర్చుని నిద్రలోకి జారుకున్నాడు.

"అన్నా.. ఊరికిబోలేదా.." ఉదయం ఆరు గంటలప్పుడు ఎవరో పలకరిస్తుంటే అన్వేష్‌కి మెలకువొచ్చింది. రైల్వేస్టేషన్ రణగొణధ్వని చెవుల్లో గుయ్‌మనిపిస్తోంటే, కళ్లు ఎర్రబారి తెరవటానికి కనురెప్పలు ఒప్పుకోవటం లేదు. ఆ టైమ్‌లో కూడా రాత్రి కనిపించిన కుర్రాణ్ని చూసి మనసు ఎలర్ట్ అయింది.

"నీ కోసమేరా.. మళ్లీ వచ్చాను" వాడి వైపు చూస్తూ అన్నాడు.

వాడి మొహంలో సంతోషం కన్నా, ఆశ్చర్యం ఎక్కువ కనిపించింది. బ్యాగ్ లోంచి టీ షర్ట్ తీసి వేస్కోమని వాడికిచ్చాడు. "నాతో వస్తావా?" అడిగాడు వాడ్ని. అన్వేష్ మీద గురి కుదిరినట్లుంది వాడికి. అంగీకారంగా తల కిందికి దించాడు. టీ షర్ట్ వాడి మోకాళ్లు దాటి వేలాడుతూ ఉంది. "పద.." వాడి భుజం మీద చెయ్యి వేశాడు.

ooo


"వీడెవడ్రా.." సునామీతో సముద్రం ఒడ్డున కొట్టుకొచ్చినట్లు కనిపిస్తున్న వాడిని చూసి తల్లి అడిగింది. అందరూ వాడ్ని, వాడి వాలకాన్ని వింతగా చూశారు.

"వీడి పేరు శ్రీను" షూస్ విప్పి పక్కన పెట్టి చెయిర్‌లో కూర్చున్నాడు.

"అది సరేగానీ.. నీకసలు ఈ రోజు ఉదయం పెళ్లిచూపులని గుర్తుందా?" విశాల తగాదాకు సిద్ధం అవుతూ అడిగింది. చెప్పిన టైమ్‌కు

## సోహా తెలివి

సిద్ధార్థ-సోహా అలీఖాన్‌ల మధ్య ఎఫైర్ గురించి కొంత కాలంగా వినిపిస్తూనే వుంది కదా. వీళ్లిద్దరూ పెళ్లి కూడా చేసుకోవచ్చని చెప్పుకున్నారు. కానీ ఇద్దరి మధ్యా తేడాలొచ్చాయని, విడిపోతున్నారని తాజాగా ప్రచారంలోకి వచ్చిన వార్తల గురించి సోహా మాట్లాడుతూ- 'నా పర్సనల్ సంగతులు అడిగితే నాకు నచ్చదు. అయినా మీడియాలో ఎవరికి తోచింది వాళ్లు రాసుకుంటే నేనేం చేస్తాను. అనవసరంగా నన్నిలాంటి వాటిలో ఇరికించకండి' అంటూ చెప్పి తప్పించుకుందేగానీ అసలు సంగతి మాత్రం ఏ విధంగానూ వివరించలేదు సోహా. ఎంతయినా తెలివైనదే!



తమ్ముడు రాలేదని కోపంగా ఉంది ఆమెకు.

"బోల్డంత ఆకలిగా ఉంది. తినటానికేమైన పెట్టాక, తిట్లు వడ్డించు" అక్కవైపు చూస్తూ నవ్వాడు. గొణుక్కుంటూ లోపలికెళ్లింది. భోజనాలయ్యాక అక్కతో వేడ్నీళ్లు పెట్టించి శ్రీనుగాడి ఒంటి మీద పట్టిన మురికంతా తనే వదిలించాడు. మేనల్లుడు వేణు బట్టల్లోంచి ఓ జత తీయించి శ్రీనుకిచ్చాడు.

"అక్కా! ఓ గ్లాసు వేడిపాలివ్వు" కేకేస్తూ పారాసెటిమాల్ టాబ్లెట్ తీసి శ్రీనుకిచ్చాడు.

"జ్వరం లేదన్నా" చెప్పాడు వాడు.

"రాత్రివేళ స్నానం చేశావు కదా. తిరగబెడుతుందేమో వేస్కో" పాలగ్లాసు కూడా చేతికిచ్చాడు.

"అయిపోయాయా? లేక ఇంకా ఈ సేవకులు మీకు, మీ యువరాజా వారికి చేయాల్సిన సేవలేమైనా ఉన్నాయా?" విశాలకు కోపం తమాయించుకోవటం చేతకావట్లేదు.

"బావా.. ఇక్కడ మంచి హార్ట్ స్పెషలిస్ట్ ఎవరైనా ఉన్నారా?" అక్క మాటలు పట్టించుకోకుండా అడిగాడతను. అడ్రస్ చెప్పాడతను.

"రేపు నేను వెళ్లి అన్వేష్ వచ్చిన విషయం వాళ్లకి చెప్పి వస్తాను" అత్తమామల వైపు భార్య వైపు చూసి చెప్పాడతను.

మర్నాడు ఉదయం శ్రీనుని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్లాడు అన్వేష్. చెకప్ అయ్యాక "ఆపరేషన్ ఎంత త్వరగా చేస్తే అంత మంచిది" స్కానింగ్ రిపోర్ట్స్ క్లోజ్ చేస్తూ అన్నాడు డాక్టర్."

"ఎంత కావచ్చు సార్?" అడిగాడు అన్వేష్.

"దాదాపు లక్ష.. అసలు ఇన్నాళ్లు బ్రతకటమే గొప్ప" చెబుతూ లెటర్ రాయటం పూర్తి చేశాడు డాక్టర్.

"పేషెంట్ డిసీజ్‌కి సంబంధించిన వివరాలు.. చేయాల్సిన ఆపరేషన్ అన్నీ ఇందులో రాశాను. బెంగుళూరు నారాయణ హృదయాలయకు వెళ్లండి. అక్కడ నా ఫ్రెండ్ డాక్టర్‌గా చేస్తున్నాడు. అతనికి ఈ లెటర్ ఇవ్వండి" హాస్పిటల్ పేరు కూడా తనే సజెస్ట్ చేస్తూ అన్నాడు ఆయన. 'ఫరవాలేదు.. ఖర్చులు తను భరించగలడు' డాక్టర్ చెప్పిన రేటుకి మనసులో అనుకున్నాడు అన్వేష్.

తన చేతిలో బిగుసుకుపోయిన శ్రీను చేతిని ధైర్యం చెబుతున్నట్లుగా నిమిరాడు అన్వేష్.

ఇంటికొచ్చేటప్పటికి అందరి ముఖాలు మ్లానమై ఉన్నాయి. "నేనెంత ఆశపడ్డాను? చక్కటి పిల్ల. వాడు కోరుకున్న లక్షణాలన్నీ ఉన్నాయి. ఈ సంబంధం కుదిరితే బాగుండునని ఎంత కోరుకున్నానో.." విశాల బాధపడుతూ అంది.

"ఏమైంది బావా?" అడిగాడు అన్వేష్.

"పిల్ల తండ్రికి ఈ ఊళ్లో బంధుబలగం, పేరు ప్రతిష్టలు ఎక్కువ. ఏదో ట్రైన్ లేటయితే సరి పెట్టుకుంటాను కానీ, ఇలా ఏవో కారణాలు చూపిస్తే ఎలా?" అన్నాడు. ఆయన బాధ ఆయనది.

"ఒక్కగానొక్క కూతురు. బంధువుల్ని పిలుచుకున్నాట్ట. మాకు విలువివ్వకపోతే ఎలా? అన్నట్లుంది ఆయన వాలకం. ఇప్పుడు పిల్లను చూపటానికి మంచి టైమ్ కాదు. తర్వాత కబురు చేస్తా అన్నారు" చెప్పాడతను.

"సరేలే.. ఇప్పుడేమయింది? ఈ సంబంధం కాకపోతే మరొకటి" అంటూ శ్రీను తనని కలిసినప్పట్నుంచి జరిగినవి చెప్పాడు. ఆ పసివాడి అవస్థకి అందరి హృదయాలు బరువెక్కాయి.

"ఈ ఆపరేషన్.. ఈ తిప్పలు నీకెందుకురా? వాడికేమయినా అయితే ఏ పోలీస్ కేసులు చుట్టుకుంటాయో. ఎక్కడో ఓ చోట అప్పచెపుదాం. కావలస్తే డబ్బు సాయం చేద్దాం" తల్లి గాభరాగా అంది.

"అమ్మా! నా పరిచయం వాడికి నేను సొంత మనిషిననే కొత్త ఊపిరి పోసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాడికి కొత్తగా వచ్చిన ధైర్యాన్ని మనం తుడిచెయ్యకూడదు" చెబుతూ మౌనంగా ఉన్న తండ్రి వైపు చూశా.

"ఏం నాన్నా.. ఈ ప్రపంచంలో మనం జంతువుల మీద ప్రేమ చూపించొచ్చు. కాలుష్యంతో వాతావరణం పాడైపోతుంది అని గొడవలు చెయ్యొచ్చు. జల సంపద తరుగుతోంది అంటూ కాన్ఫరెన్స్‌లు నిర్వహించొచ్చు. కానీ, ఒక మనిషి మరో ప్రాణమున్న మనిషిని చేరతీయాలంటే ఎందుకు భయపడటం? ప్రపంచం మొత్తాన్ని మనం ఉద్ధరించలేము. మన పరిధిలో చేతనైనంత మనం చేస్తే తప్పేంటి?"

అతని ప్రశ్నకు ఎవరి దగ్గరా సమాధానం లేదు.

ooo

"అన్వేష్.. హాస్పిటల్‌కు వెళ్లారా?" విశాల ఫోన్ చేసింది.

"సిటీ అవుట్‌స్కర్ట్స్‌లో ఉన్నాం. ఇంకొద్ది సేపట్లో వెళతాం" ఆటోలో తన భుజం మీద వాలి నిద్రపోతున్న శ్రీను వైపు చూస్తూ అన్నాడు.

"సరే.. నీకో ముఖ్యమైన విషయం. నిన్న మనం చూడాలనుకున్న అమ్మాయి ఫ్రెండ్స్‌తో మనింటికొచ్చేసింది. నిన్ను చాలా అభినందిస్తూ మాట్లాడింది. తన తరఫున, తన ఫ్రెండ్స్ తరఫున ఇరవై వేలు ఆ చిన్నాడికి ఖర్చు పెట్టమని బలవంతంగా ఇచ్చెళ్లింది. నిన్ను చూడకపోయినా, తనకి నువ్వు నచ్చేవుట. నీకు తను నచ్చితే ఇక పెళ్లేనట. చెప్పటానికి సిగ్గుపడిందిలే.. అన్నట్లు ఆపరేషన్ డేట్ చెబితే మేమందరం అక్కడికొస్తాం. నాన్నగారు చెప్పమన్నారు" ఫోన్ పెట్టేసింది.

అతని పెదాలపై చిరుదరహాసం. నిద్రపోతున్న శ్రీనుగాడి ఉంగరాల జుట్టు చేతితో నిమిరాడు.

## రూటు మార్చాల్సిందే!

*ఆయేషా టకియా ఇకపై వీలైనంత వరకూ యాక్షన్ ప్యాక్డ్ పాత్రలనే వేయాలనుకుంటోందిట. మాస్‌కి దగ్గరై క్రేజ్ సంపాదించుకోవాలంటే యాక్షన్ కేరక్టర్సే వేయాలి అని ఘంటాపథంగా చెబుతోంది. ఇప్పటిదాకా తను నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చాలావరకు చాసిందిట, కానీ కమర్షియల్ స్టార్‌గా తనకి రావాల్సినంత పేరు రాలేదు కాబట్టి, ఇకపై ఎక్కువగా 'యాక్షన్ ఓరియంటెడ్ పాత్రలే వేయాలనుకుంటోందిట. మరి బాలీవుడ్ నిర్మాతలు ఆమె మాట వింటున్నారో లేదో!*

